# రేవంత్ పాలనలో ఫాలింగ్

- ఏడాదిలో 91.81 కోట్లు తగ్గిన పన్ను ఆదాయం
- కాగ్ సూచికలే సాక్ష్యం
- మాజీ మంత్రి హరీశ్‌రావు



హైదరాబాద్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): 'రేవంత్ పాలనలో తెలంగాణ రైజింగ్ కాదు ఫాలింగ్.. రాష్ట్ర ఆర్థిక వృద్ధి తగ్గిపోవడమే నిదర్శనం.. కాగ్ నెలవారి నివేదికే ఇందుకు సాక్ష్యం' అని మాజీ మంత్రి హరీశ్‌రావు ఉద్ఘాటించారు. 2023-24లో సొంత పన్నుల ఆదాయం రూ. 1,24,146.19 కోట్లు కాగా, 2024-25లో రూ.1,24,054.38 కోట్లకు పడిపోయిందని, మొత్తంగా రూ. 91.81 కోట్లు తగ్గిపోవడంపై గురువారం ఎక్స్ వేదికగా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కొవిడ్ సమయంలో తప్ప రాష్ట్రంలో ఇంతటి తగ్గుదల ఎప్పుడూ కనిపించలేదని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి అనాలోచిత నిర్ణయాలు, అవగాహన లేని పాలనావిధానాలే ఇందుకు కారణమని విశ్లేషించారు. 2014-15 నుంచి 2022-23 వరకు బీఆర్‌ఎస్ హయాంలో 12 శాతం సొంత పన్నుల ఆదాయం వృద్ధి సాధించిన విషయాన్ని గుర్తుచేశారు.

# వ్యవసాయ వ్యర్థాల నుంచి బయోగ్యాస్

- ప్లాంట్ల ఏర్పాటుకు 'జీపీఎస్' సుముఖత
- ఐవోసీఎల్, బీపీసీఎల్ సంస్థలతో కలిసి రాష్ట్రంలో 15 ప్లాంట్ల ఏర్పాటుకు ప్రణాళికలు
- మంత్రి తుమ్మలకు ప్రాజెక్టు వివరాలు



హైదరాబాద్, ఏప్రిల్ 17(నమస్తే తెలంగాణ) : వ్యవసాయ వ్యర్థాల నుంచి బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేసేందుకు 'జీపీఎస్ రెన్యూవబుల్ ఆర్యా' ముందుకొచ్చింది. ఈ మేరకు ప్రాజెక్టు వివరాలను గురువారం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వివరించింది. ఐవోసీఎల్, బీపీసీఎల్ సంస్థలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా 15 ప్లాంట్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించినట్టు తెలిపింది. ఒక్కో ప్లాంట్‌లో రోజువారీగా 15 టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో మొత్తం 225 టన్నుల ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నట్టు వెల్లడించింది. మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, ఖమ్మం, సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రిభువనగిరి, వనపర్తి, మహబూబ్‌నగర్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో ఏర్పాటుచేయాలని భావిస్తున్నట్టు తెలిపింది. వీటి ఏర్పాటుతో దాదాపు 3వేల మంది గ్రామీణ యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని స్పష్టంచేసింది. మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. 'రాష్ట్ర అభివృద్ధిలో పునరుత్పాదక ఇంధనరంగం కీలకపాత్ర పోషించాలి. వ్యవసాయ వ్యర్థాలు రైతులకు ఆదాయమార్గంగా మారే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి. ప్రభుత్వం ఈ యూనిట్ల ఏర్పాటుకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నది.' అని తెలిపారు.

# టన్నెల్ బదులు పైప్‌లైన్!

- దేవాదుల ప్యాకేజీ-3లో ఏర్పాటుకు నిర్ణయం

హైదరాబాద్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): దేవాదుల ప్రాజెక్టు మూడో దశలో ఇటీవల పగుళ్ల బారిన పడిన టన్నెల్ స్థానంలో పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని ఇరిగేషన్‌శాఖ సమాలోచనలు చేస్తున్నది. ఆ దిశగా సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నది. దేవాదుల 3వ దశ నీటి పంపింగ్‌ను ఇటీవల ప్రారంభించారు. అయితే, దేవన్నపేట పంప్‌హౌజ్ జలాల ప్రెషర్ మెయిన్ పైప్‌లైన్ ద్వారా వచ్చి, ఆ తరువాత 200 మీటర్ల టన్నెల్ ద్వారా ప్రయాణించి తిరిగి ప్రెషర్ మెయిన్ పైపుల నుంచి ధర్మసాగర్ రిజర్వాయర్‌కు చేరుకుంటాయి. ప్రస్తుతం ధర్మసాగర్ రిజర్వాయర్ వద్ద టన్నెల్ నుంచి నీళ్లు లీకై వృథాగా పోతున్నాయి. ఈ నేపథ్యంలో ముందుముందు సమస్యలు తలెత్తకుండా టన్నెల్ బదులు అక్కడ పైప్‌లైన్ వేయాలనే దిశగా ఉన్నతాధికారులు సమాలోచనలు చేస్తున్నారు.

# మోదీ, అమిత్‌షా పెద్ద కేడీలు!

- కాంగ్రెస్ అగ్రనేతలపై మోదీ కుట్రలు, కక్షపూరిత రాజకీయాలు
- ఇందులో భాగంగానే సోనియా, రాహుల్‌పై నేషనల్ హెరాల్డ్ కేసు
- మేం అధికారంలోకి వచ్చాక మోదీ, షాను జైలుకు పంపుతాం: అద్దంకి
- ఏఐసీసీ అహ్మదాబాద్ ఎజెండాకు భయపడే కేసు: మహేశ్‌కుమార్ గౌడ్
- హైదరాబాద్ ఈడీ ఆఫీస్ ఎదుట ధర్నాలో కాంగ్రెస్ నేతల గరం



హైదరాబాద్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): బ్రిటిష్ వలస పాలకులకే వెనుకడుగు వేయని కాంగ్రెస్ నాయకులు మోదీ, అమిత్ షాకు భయపడతారని భావించడం బీజేపీ నేతల అహంకారానికి నిదర్శనమని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ పేర్లను ఈడీ నేషనల్ హెరాల్డ్ కేసు చార్జిషీట్‌లో పేర్కొనడాన్ని నిరసిస్తూ ఏఐసీసీ పిలుపు మేరకు ఆ పార్టీ నేతలు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేశారు. హైదరాబాద్‌లోని ఈడీ ఆఫీస్ ఎదుట నిర్వహించిన ధర్నాలో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అద్దంకి దయాకర్ మాట్లాడుతూ మోదీ, అమిత్‌షా కేడీలు, దొంగలు.. దేశం కోసం ప్రాణాలర్పించిన, సెంటు భూమిలేని, సొంత ఇల్లు కూడా లేని సోనియా కుటుంబంపై కక్షగట్టారని మండిపడ్డారు. స్వాతంత్ర్య సంగ్రామంలో మీ పాత్ర ఎక్కడ అంటూ తీవ్ర స్థాయిలో విమర్శించారు. 2029లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించి కుట్రలను తిప్పికొడతామని, ఆ తర్వాత మోదీ ఉండేది జైలులోనే అని విరుచుకుపడ్డారు. దొంగతనం చేసింది మీరు, కేడీలు మీరు అంటూ దుయ్యబట్టారు. ఆర్‌ఎస్‌ఎస్ ఇలాంటి దరిద్రపుగొట్టు నాయకులను దేశానికి ఇచ్చిందా? అని ప్రశ్నించారు. దేశం కోసం త్యాగాలు చేసిన పార్టీపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని అంజన్‌కుమార్ యాదవ్ మండిపడ్డారు. కిషన్‌రెడ్డిని ఉద్దేశించి అంజన్‌కుమార్‌యాదవ్ రాయడానికి వీలులేని భాషలో దూషించారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్రవిమర్శలు చేశారు. అహ్మదాబాద్‌లో ఏఐసీసీ సమావేశంలో కాంగ్రెస్ రూపొందించిన ఎజెండాకు భయపడి, నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్ పేర్లను చేర్చారని ఆరోపించారు. ధర్నాలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, సీనియర్ నాయకుడు వీ హనుమంతరావు, ఏఐసీసీ సెక్రటరీ విశ్వనాథ్, సీడబ్ల్యూసీ సభ్యుడు వంశీచంద్‌రెడ్డి, ఏఐసీసీ సెక్రటరీలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు పాల్గొన్నారు.

## కంచ గచ్చిబౌలి భూమిని ప్రైవేట్‌కు ఇవ్వం

- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

హైదరాబాద్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిని ప్రైవేటు పరం చేసే ఆలోచన ప్రభుత్వానికి లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. భూములు ప్రైవేటువ్యక్తి పరమవకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాపాడుతుందని చెప్పారు. గురువారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడిన మహేశ్‌కుమార్‌గౌడ్ హెచ్‌సీయూ వ్యవహారంలో సీనియర్ ఐఏఎస్ అధికారిణి స్మితాసబర్వాల్ రీట్వీట్‌పై స్పందించారు. స్మితాసబర్వాల్ ఏ ఉద్దేశంతో రీట్వీట్ చేశారో ఆమెకే తెలియాలని పేర్కొన్నారు. ఆమెది తొందరపాటుతప్పు, ఏమీలేదని వ్యాఖ్యానించారు. గతంలో కూడా స్మితాసబర్వాల్‌కు యూనివర్సిటీ నుంచి నోటీసులు కూడా వచ్చాయని గుర్తుచేశారు. రీట్వీట్ ఎందుకు చేశారో ఆమెనే అడగాలని విలేకరులడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

## కరెంట్ షాక్‌తో రైతు మృతి

- పొలానికి వెళ్తుండగా ఘటన
- రంగారెడ్డి జిల్లా పర్వతాపూర్‌లో విషాదం



అశోక్‌రెడ్డి (ఫైల్)

కొందుర్గు, ఏప్రిల్ 17: విద్యుత్తు షాక్‌తో రైతు మృతి చెందిన ఘటన రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండల పరిధిలోని పర్వతాపూర్‌లో గురువారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పర్వతాపూర్‌కు చెందిన రైతు అశోక్‌రెడ్డి (35) పక్క పొలంలో నుంచి తన పొలానికి వెళ్తుండగా అప్పటికే వర్షానికి తెగిపడి ఉన్న కరెంటు తీగలు తగలడంతో షాక్‌కు గురై మరణించాడు. విద్యుత్తు శాఖ తప్పిదంవల్ల అశోక్‌రెడ్డి మృతి చెందినట్టు బాధిత కుటుంబసభ్యులు ఆరోపించారు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు చిన్నఎల్కిచర్ల సబ్‌స్టేషన్ ఎదుట మృతదేహంతో ధర్నా నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అధికారుల నిర్లక్ష్యంతోనే నిండు ప్రాణం పోయిందని ఆరోపించారు.

## బెట్టింగ్‌కు మరో విద్యార్థి బలి



పవన్(ఫైల్)

బండ్లగూడ, ఏప్రిల్ 17: బెట్టింగ్‌కు బానిసై మరో విద్యార్థి బలైన ఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. గద్వాల్‌కు చెందిన పెద్ద నరసింహులు కుమారుడు పవన్(24)తన స్నేహితులతో కలిసి అత్తాపూర్‌లో అద్దెకు ఉంటూ మాసబ్‌ట్యాంక్‌లోని జేఎన్టీయూలో ఎంటెక్ చదువుతున్నాడు. ఈక్రమంలో పవన్ ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిస అయ్యాడు. బెట్టింగ్ కోసం తన ఐఫోన్, బైక్‌ను సైతం అమ్మేశాడు. ఎలాంటి లాభాలు రాకపోవడంతో మనస్తాపానికి గురై పవన్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్నేహితుల ద్వారా విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఘటన స్థలానికి వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి కేసును దర్యాప్తు చేస్తున్నారు.

# ఆ 45 టీఎంసీలు తెలంగాణకే కేటాయించాలి

- బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట తెలంగాణ ప్రభుత్వ వాదనలు
- మే 16కు విచారణ వాయిదా




హైదరాబాద్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): పోలవరం నుంచి 80 టీఎంసీలను కేడీఎస్ (కృష్ణా డెల్టా సిస్టమ్)కు మళ్లించడం ద్వారా ఉమ్మడి ఏపీ రాష్ట్రానికి కేటాయించిన 45 టీఎంసీలను ప్రస్తుత తెలంగాణకే కేటాయించాలని బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్‌కు రాష్ట్రం తరఫున న్యాయవాది నివేదించారు. కేంద్రప్రభుత్వం జారీచేసిన సెక్షన్ 3 మార్గదర్శకాల మేరకు ఇరు రాష్ట్రాల మధ్య కృష్ణాజలాల పునఃపంపిణీకి సంబంధించి బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ చేపట్టిన విచారణ ఢిల్లీలో గురువారం సైతం కొనసాగింది. ట్రిబ్యునల్ చైర్మన్ జస్టిస్ బ్రిజేశ్‌కుమార్, సభ్యులు జస్టిస్ రామ్మోహన్‌రెడ్డి, జస్టిస్ ఎస్ తలపాత్ర ఎదుట తెలంగాణ సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ బుధవారం నాటి వాదనలను కొనసాగించారు. గోదావరి ట్రిబ్యునల్ అవార్డును ఈ సందర్భంగా ఉటంకించారు. కృష్ణా నది నుంచి ఎక్కువ మొత్తంలో జలాలను ఏపీ వినియోగించుకుంటున్నదని, అది కూడా బేసిన్ అవతలికి మళ్లిస్తున్నదని మహారాష్ట్ర, కర్ణాటక తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయని గుర్తుచేశారు. కృష్ణా లోటు బేసిన్ కాబట్టి గోదావరి నీటిని మళ్లించుకోవాలని ఆ రాష్ట్రాలు వాదించాయని తెలిపారు. ఈ నేపథ్యంలో గోదావరి ట్రిబ్యునల్ ఎదుట పోలవరం వివాద సమస్య పరిష్కారం కోసం ఉమ్మడి ఏపీ రాష్ట్రం 1978లో కర్ణాటక, మహారాష్ట్రలతో ఒప్పందం కుదుర్చుకున్నదని వివరించారు. పోలవరం నుంచి 80 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌లో మళ్లించాలని, తద్వారా అందులో 35 టీఎంసీల కృష్ణాజలాలను ఆ రెండు రాష్ట్రాలకు, మిగిలిన 45 టీఎంసీలను పూర్వ ఆంధ్రప్రదేశ్, అది కూడా నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎగువనే వినియోగించుకోవాలనే షరతు ఉందని వాదనలు వినిపించారు. ప్రస్తుతం ఆ 45 టీఎంసీల కృష్ణా జలాలను తెలంగాణకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ప్రస్తుతం ఏపీ చేపట్టిన గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టు, అందుకోసం ఏర్పాటు చేసిన జలహారతి కార్పొరేషన్ తదితర అంశాలను ట్రిబ్యునల్ దృష్టికి తీసుకెళ్లారు. నాగార్జునసాగర్ కుడి కాలువ, ఇతర ప్రాజెక్టుల కింద నీటి వినియోగాన్ని పోలవరం నుంచి మళ్లించనున్న నీటితో భర్తీ చేయనున్నారని తెలిపారు. ఏపీ చేపట్టిన చింతలపూడి, తాడిపూడి తదితర లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల విస్తరణ అంశాలను కూడా ఉటంకించారు. కేడీఎస్ కాలువ నీటి వినియోగాన్ని లెక్కించాలని కోరారు. ఏపీ వివిధ పథకాల ద్వారా గోదావరి జలాలను కృష్ణాలోకి మళ్లించే అవకాశం ఉందని, తద్వారా ఆదా చేసిన కృష్ణా నీటిని బేసిన్ ప్రాంతాలకు కేటాయించాలని ట్రిబ్యునల్‌కు తెలంగాణ నివేదించింది. తదుపరి విచారణను మే 14, 15, 16వ తేదీలకు చైర్మన్ బ్రిజేశ్‌కుమార్ వాయిదా వేశారు. సీనియర్ కౌన్సెల్ సీఎస్ వైద్యనాథన్, అదనపు అడ్వకేట్ జనరల్ రజనీకాంత్‌రెడ్డి, ఇతర న్యాయవాదులు, ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ఐఎస్‌డబ్ల్యూఆర్ యూనిట్ సూపరింటెండింగ్ ఇంజినీర్ సల్లా విజయ్‌కుమార్, ఇతర ఇంజినీర్లు రవిశంకర్, వెంకటనారాయణ తెలంగాణ రాష్ట్రం తరఫున విచారణకు హాజరుకాగా, ఏపీ నుంచి సీనియర్ కౌన్సెల్ జయదీప్ గుప్తా, ఉమాపతి, ఇతర న్యాయవాదులు, ఇంజినీర్లు హాజరయ్యారు.

## వక్ఫ్ భూములను డిజిటలైజేషన్ చేస్తాం

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి



హైదరాబాద్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): వక్ఫ్ భూములన్నింటినీ డిజిటలైజేషన్ చేసి, ప్రతి ఏడాది ఆడిట్ చేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. గురువారం హైదరాబాద్ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన 'వక్ఫ్ సుధార్ జనజాగరణ అభియాన్' వర్క్ షాప్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. వక్ఫ్ భూములను జియోట్యాగింగ్ చేయడం ద్వారా పర్యవేక్షిస్తామని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వక్ఫ్ బిల్లుపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేయొద్దని హితవు పలికారు. బీజేపీ ఆధ్వర్యంలో జిల్లాల స్థాయిలో సమావేశాలు నిర్వహించి ప్రజల అనుమానాలు నివృత్తి చేస్తామని వివరించారు. వక్ఫ్ చట్టాన్ని సవరించి పేద ముస్లింలకు మేలు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన పేర్కొన్నారు.



డెడ్‌స్టోరేజీకి చేరిన జూరాల ప్రాజెక్టు

# డెడ్‌స్టోరేజీ దశలో జూరాల

- నేటి నుంచి కాల్వలకు నీటి విడుదల బంద్
- మరో వారం నీళ్లు వదలాలంటున్న రైతులు

గద్వాల, ఏప్రిల్ 17 : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు డెడ్ స్టోరేజీకి చేరింది. నీటిమట్టం పూర్తిగా తగ్గిపోయింది. ప్రస్తుతం డ్యాంలో 2.953 టీఎంసీలు ఉండగా.. సాగునీటిని వాడుకునే అవకాశం లేకుండా పోయింది. కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించాల్సి ఉంటుంది. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో తాగునీటి అవసరాల కోసం వినియోగించుకోవాల్సి ఉన్నది. ఎడమ కాల్వకు 310 క్యూసెక్కులు, కుడి కాల్వకు 148 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఈ నీళ్లు సరిపోక రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలు చేతికొచ్చే వరకు సాగునీళ్లు వదలాల్సిందేనని రైతులు కోరుతుండగా.. ఒకవేళ పంటలకు నీళ్లిస్తే రాబోయే రెండు నెలలు ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తప్పవు. పంటలకు నీటిని విడుదల చేయాలని రెండ్రోజుల కిందట జూరాల డ్యాం ఎడమ కాల్వ పరిధిలోని ఆయకట్టు రైతులు ధర్నా చేపట్టగా.. రెండ్రోజులపాటు అధికారులు నీటిని వదిలారు. జలాశయంలో నీటి నిల్వలు తగ్గడంతో శుక్రవారం నుంచి కాల్వలకు నీటి విడుదలను నిలిపివేస్తామని ప్రాజెక్టు అధికారులు చెప్పడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని రెండ్రోజులు నీటిని వదిలామని, ఈనెల చివరి వరకు విడుదల సాధ్యం కాదని చెప్తున్నారు. వానకాలంలో వరదలు వచ్చిన సమయంలో ప్రాజెక్టును పూర్తి స్థాయిలో నీటితో నింపుకొని ఉంటే నేడు ఈ పరిస్థితి వచ్చేది కాదని రైతులు పేర్కొంటున్నారు.

## ఈడీ సోదాల్లో 74.50 లక్షలు స్వాధీనం

హైదరాబాద్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్, సికింద్రాబాద్‌లోని సాయిసూర్య డెవలపర్స్, సురానా కంపెనీల్లో రెండు రోజుల పాటు సోదాలు నిర్వహించిన ఈడీ రూ.74.50 లక్షల నగదు స్వాధీనం చేసుకుంది. ఈ మేరకు గురువారం ఈడీ అధికారులు ప్రకటన విడుదల చేశారు. మనీ లాండరింగ్ యాక్ట్‌కు విరుద్ధంగా నగదు బదిలీలు జరిగాయనే సమాచారంతో సోదాలు చేసినట్టు తెలిపారు. ఈ దాడుల్లో వివిధ నేరారోపణ పత్రాలు స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. నరేంద్ర సురానా పలు షెల్ కంపెనీలు ఏర్పాటు చేసి, అక్రమ లావాదేవీలకు పాల్పడినట్టు ఈడీ గుర్తించింది. బ్యాంకులో నుంచి తీసుకున్న రుణంతో షెల్ కంపెనీలకు నిధులు బదలాయించినట్టు గుర్తించామని ఈడీ అధికారులు వెల్లడించారు. సురానా ఇండస్ట్రీస్ అనుబంధ కంపెనీ అయిన సాయిసూర్య డెవలపర్స్‌కు చెందిన సతీశ్ ఇంట్లో కూడా భారీగా నగదు సీజ్ చేసినట్టు ఈడీ అధికారులు చెప్పారు. వట్టినాగులపల్లిలో వెంచర్ పేరుతో డబ్బులు వసూలు చేసి, మోసం చేశాడనే ఆరోపణలతో కొన్నిరోజుల క్రితం సతీశ్‌ను సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు ఆధారంగా సాయి డెవలపర్స్‌పై ఈడీ విచారణ జరిపింది. ఆఫీసులలో జరిపిన సోదాల్లో హార్డ్ డిస్కులు, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం ఈడీ చేసుకుంది.




భూపాలపల్లి జిల్లా కాటారం మండలం దేవరాంపల్లిలో ఖాళీ బిందెలతో మహిళల రాస్తారోకో

## ఖాళీ బిందెలతో మహిళల నిరసన

- దేవరాంపల్లిలో రోడ్డుపై బైఠాయింపు

కాటారం, ఏప్రిల్ 17: తాగు నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం రేగులగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని దేవరాంపల్లిలో మహిళలు గురువారం ఖాళీ బిందెలతో కాటారం-మంథని ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ.. కొన్ని రోజులుగా తాగునీరు రావడం లేదని, బోర్లు కూడా పనిచేయక తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ధర్నాతో 2 గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్ అక్కడికి చేరుకొని 48 గంటల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



కుంటాలలోని ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సమావేశంలో పెండింగ్ బిల్లులపై అధికారులను నిలదీస్తున్న మాజీ సర్పంచ్

## పెండింగ్ బిల్లులు ఇంకెప్పుడిస్తరు?


**డీపీవోను నిలదీసిన మాజీ సర్పంచ్‌లు**

కుంటాల, ఏప్రిల్ 17 : గ్రామ పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులను ఇంకెప్పుడిస్తారని పలువురు సర్పంచ్‌లు అధికారులను నిలదీశారు. గురువారం నిర్మల్ జిల్లా కుంటాల మండలంలోని రైతు వేదికలో డీపీవో శ్రీనివాస్ అధ్యక్షతన ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సమావేశం జరిగింది. ఇందులో మాజీ సర్పంచ్‌లు తమ ఆక్రోశాన్ని వెళ్లగక్కారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మాజీ సర్పంచ్‌లకు బిల్లులు అందిస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అధికారంలోకి రాగానే హామీని విస్మరించి కాలయాపన చేస్తున్నదని మండిపడ్డారు. ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు దాటినా పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడం దారుణమని అన్నారు.

# జపాన్‌లోనూ అప్పుల వేట!

**రూ.11,693 కోట్ల అప్పులు కావాలని జపాన్ ఏజెన్సీ జైకాను కోరిన సీఎం రేవంత్**

- మెట్రోరైలు రెండో దశ, మూసీ పునరుజ్జీవనం, రేడియల్ రోడ్ల నిర్మాణానికి సాయం చేయాలని విజ్ఞప్తి
- మేము రుణం ఇవ్వాలంటే మీరు కేంద్రంతో మాట్లాడాలి
- సీఎంకు జైకా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సూచన



హైదరాబాద్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా జపాన్ పర్యటనకు వెళ్తున్నట్టు ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. తీరా అక్కడికి వెళ్లాక అప్పుల వేట మొదలుపెట్టారు. తెలంగాణ రైజింగ్‌కు రూ.11,693 కోట్ల రుణం కావాలని జపాన్ ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్ ఏజెన్సీ (జైకా) ప్రతినిధులను కోరారు. జపాన్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బృందం గురువారం జైకా ప్రతినిధులతో సమావేశమైంది. సీఎంతోపాటు పలువురు రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, జైకా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ షోహేయ్ హరా, ఆ సంస్థ సీనియర్ మేనేజర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మెట్రో రైలు రెండో దశ, మూసీ పునరుజ్జీవనం, రీజనల్ రింగ్ రోడ్డు నుంచి ఔటర్ రింగ్ రోడ్డును అనుసంధానిస్తూ నిర్మించనున్న రేడియల్ రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ఆర్థిక సాయం అందించాలని సీఎం రేవంత్‌రెడ్డి జైకా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ షోహేయ్ హరాను కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూ.24,269 కోట్ల అంచనాలతో చేపట్టనున్న మెట్రో రైలు రెండో దశ ప్రతిపాదనలు ఇప్పటికే కేంద్రం తుది పరిశీలనలో ఉన్నాయని సీఎం వారికి వివరించారు. ఈ ప్రాజెక్టుకు అవసరమయ్యే వ్యయంలో 48% అంటే రూ.11,693 కోట్లను రుణంగా ఇవ్వాలని కోరారు. భారత ప్రభుత్వ విదేశీ రుణ నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం పాటిస్తుందని ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు. మెట్రోరైలుతోపాటు మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు, ఫ్యూచర్ సిటీకి, కొత్త రేడియల్ రోడ్లకు కూడా నిధులు సమకూర్చాలని కోరారు. హైదరాబాద్ నగరాన్ని న్యూయార్క్, టోక్యో లాంటి ప్రపంచ నగరాలతో సమానంగా అభివృద్ధి చేయాలన్నది తమ లక్ష్యమని సీఎం వారికి వివరించారు. ముఖ్యమంత్రి విజ్ఞప్తికి షోహేయ్ హరా స్పందిస్తూ.. మెట్రో రైలు విస్తరణతోపాటు అర్హతలు ఉన్న ఇతర అభివృద్ధి ప్రాజెక్టులకు జైకా నుంచి ఆర్థిక సాయం పొందేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించాలని సూచించారు. జైకాకు తెలంగాణతో ఎన్నో ఏండ్లుగా సంబంధాలు ఉన్నాయని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. సమావేశంలో రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్, సీఎం ముఖ్య కార్యదర్శి వీ శేషాద్రి, మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, తెలంగాణకు చెందిన ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

**15 నెలల్లో రూ.1,53,359 కోట్ల అప్పులు**

రేవంత్‌రెడ్డి సర్కారు అధికారంలోకి వచ్చిన తరువాత 15 నెలల్లోనే రూ.1,53,359 కోట్లు అప్పులు చేసింది. ఇటీవల కంచ గచ్చిబౌలిలోని భూములను తాకట్టు పెట్టి రూ.10 వేల కోట్ల రుణం పొందింది. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాలను అమ్మకానికి పెట్టేందుకు సిద్ధమైంది. రాత్రికి రాత్రి బుల్డోజర్లు పెట్టి వందల ఎకరాల్లోని వృక్షాలను ధ్వంసం చేసింది. అయితే, హెచ్‌సీయూ విద్యార్థుల ఆందోళనలు, సుప్రీంకోర్టు ఆదేశాలతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో మామిడిపల్లిలోని 450 ఎకరాలను అమ్మకానికి పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నదనే వార్తలొచ్చాయి. మరోవైపు, ముఖ్యమంత్రి జపాన్ పర్యటన సందర్భంగానూ అప్పుల కోసం ప్రయత్నించడం చర్చనీయాంశంగా మారింది. స్వల్పకాలంలోనే భారీగా అప్పులు చేసిన రేవంత్ సర్కారు.. కొత్తగా ఒక్క ప్రాజెక్టును కూడా కట్టకపోగా, రన్నింగ్ ప్రాజెక్టులను సైతం ఎండబెడుతున్నదనే విమర్శలను ఎదుర్కొంటున్నది. కనీసం రైతు భరోసా నిధులు కూడా సక్రమంగా ఇవ్వకుండా ఎగనామం పెడుతున్నదన్న అసంతృప్తి రైతుల్లో వ్యక్తమవుతున్నది.

## యూజీసీ నెట్ నోటిఫికేషన్ విడుదల

హైదరాబాద్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) గురువారం యూజీసీ నెట్-2025 జూన్ సెషన్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి మే 7 వరకు గడువు విధించింది. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో పరీక్ష ఫీజును చెల్లించడానికి మే 8 వరకు గడువు ఇచ్చింది. జూన్ 21 నుంచి జూన్ 30 వరకు కంప్యూటర్ ఆధారిత విధానంలో జూన్ సెషన్ యూజీసీ నెట్ పరీక్షలు నిర్వహించనున్నారు. ttps://ugcnet.nta.ac.in/www.nta.ac.in వెబ్‌సైట్ ద్వారా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి. జనరల్ క్యాటగిరీ అభ్యర్థులు రూ.1,150, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ క్యాటగిరీ అభ్యర్థులు రూ.650, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ, థర్డ్ జెండర్ అభ్యర్థులు రూ.325 చొప్పున ఫీజు చెల్లించాలి.